**జూన్ 18** – జయపూర్‌లోని విక్రమ్ హోటల్‌లో అతను బస చేసినట్టు కనిపెట్టారు. అతని కదలికలు కనిపెట్టి పట్టుకున్నారు. అరెస్టు చేశారు. అతనికి ఒక కాలు లేదు. ఆ విషయం సిట్‌వారికి ఫోన్ చేసి చెప్పగానే అతనే శివరూపన్ అయి వుంటాడని వీళ్లు గ్రహించేశారు. (రాజీవ్ హత్య – 9లో యితని గురించి రాశాను. మే 1 న వచ్చిన హంతక ముఠాలో 7 వ సభ్యుడు శివరూపన్. ఇతను పొట్టు అమ్మన్‌కు నమ్మకస్తుడైన వ్యక్తిగత వైర్‌లెస్ ఆపరేటర్. ఈ ఉగ్రవాద సంస్థలన్నిటికీ ఆయువుపట్టు కమ్యూనికేషన్. ఆ కమ్యూనికేషన్ జరపాల్సింది వైర్‌లెస్‌తోనే, ఒక వ్యక్తిగతమైన కోడ్‌తోనే. నాయకుడు ఆదేశాలివ్వడానికి, సమాచారం అందుకోవడానికి వైర్‌లెస్ ఆపరేటర్ అత్యంత అవసరం. వాడికి అన్ని రహస్యాలు తెలుస్తాయి. ఇంత ముఖ్యమైన వ్యక్తిని పొట్టు అమ్మన్ ఇండియాకు ఎందుకు పంపాడంటే దానికి ఓ కారణం వుంది. ఈ శివరూపన్ ఒక ల్యాండ్‌మైన్‌లో కాలు పోగొట్టుకున్నాడు. అతనికి జయపూర్ వెళ్లి కృత్రిమమైన కాలు అమర్చుకోవాలని కోరిక. పొట్టు అమ్మన్‌ను బతిమాలితే అతను కాదనలేక సరే నన్నాడు. ఇతను మే1 న ఇండియాకు వచ్చి సురేష్‌కుమార్ అనే మారుపేరుతో సంచరించాడు. 18, 32 భాగాల్లో యితను జయపూర్ వెళ్లిన వైనం రాసాను)

శివరూపన్ వద్ద దొరికిన ఫోన్ నెంబర్లలో ఒకటి మద్రాసులోని రాబర్ట్ పయాస్‌ది. తంజావూరులో అరెస్టయిన రూసో దగ్గర దొరికింది కూడా యిదే నెంబరు. ఇంకో నెంబరు కూడా దొరికింది.

నళినిని అరెస్టు చేయడం శివరాజన్‌ను కలవరపరిచింది. నళిని కరడుగట్టిన ఎల్‌టిటిఇ కార్యకర్త కాదు. పట్టుబడితే సైనైడ్ మింగేరకం కాదు. మామూలు పౌరురాలు. పోలీసులు లాఠీ ఝళిపిస్తే తెలిసినదంతా కక్కేసే రకం. తమ పేర్లతో సహా జరిగినదంతా పురాణం విప్పేస్తుందని భయపడ్డాడు. అందుకని జూన్ 18న పంపిన సందేశంలో "నళినిని విడిపించటం కోసం ఒక లాయర్ను ఏర్పాటు చేయాలి" అని పొట్టు అమ్మన్‌కు సూచించాడు. అది అమ్మన్‌కు నచ్చలేదు. నళినిని కాపాడడానికి ఎల్‌టిటిఇ ఏ మాత్రం ప్రయత్నం చేసినా రాజీవ్ హత్య వెనుక తాము లేమని బుకాయించే వీలు వుండదు. అందుకని "నళిని విషయం నీ కనవసరం. అంతేకాదు, ఎల్‌టిటిఇ రాజకీయ విభాగంలో పనిచేస్తున్నట్లు చెప్పుకుంటూ నిజానికి యింటెలిజెన్సు విభాగంలో పనిచేస్తున్న కాంతన్ (రాజీవ్ హత్య– 10 లో యితని గురించి రాశాను) వంటి వాళ్ల గురించి కూడా పట్టించుకోవద్దు. నీ ముందున్న తక్షణ కర్తవ్యం ఒక్కటే ! – సిట్‌ను, పోలీసుల్ని తప్పించుకుని జాఫ్నా పారిపోయి వచ్చేయడం. కాంతన్ అతని అనుచరులు చిన్నపిల్లలు కాదు. వాళ్ల సంగతి వాళ్లు చూసుకుంటారు. నువ్వు అడిగినప్పుడు వాళ్లకు డబ్బిస్తే చాలు." అని సమాధానం యిచ్చాడు. కాంతన్‌కు వాళ్లకు రాజీవ్ హత్యలో ఎల్‌టిటిఇ పాత్ర గురించి పూర్తిగా తెలియదు. వాళ్లు పట్టుబడినా ఏమీ చెప్పలేరు, శివరాజన్ ఎటు పారిపోయాడో వాళ్లకే తెలియనప్పుడు పోలీసులకేం చెప్తారు? అందువలన వీళ్లని మాత్రమే జాఫ్నా తీసుకురావడానికే అమ్మన్ నిర్ణయించాడు.

అంతలోనే అతను వ్యూహం మార్చాడు – "తమిళనాడు తీరమంతా భద్రతాదళాల పహరాతో నిండిపోయింది. ఇప్పటికిప్పుడు మీరు జాఫ్నా రాలేరు. మిమ్మల్ని సురక్షితమైన యింకో క్యాంప్‌కు తరలించాలి. ఆ పని చేపట్టడానికి తిరుచ్చి శంతన్ ఒప్పుకున్నాడు. ఒక ట్రక్కులో మీ అందర్నీ తరలిస్తాడు." అని శివరాజన్‌కు జూన్ 19 న సందేశం పంపాడు. ఇలా వ్యూహం మారడానికి కారణం ఏమిటంటే – వాళ్ల మధ్య జరిగే సందేశాలను డీకోడ్ చేయగల సామర్థ్యం సిట్ సంపాదించింది. శివరాజన్ పారిపోతున్నాడన్న సమాచారం తెలుసుకుని కోస్తాతీరమంతా గట్టి భద్రత ఏర్పాటు చేసింది.

తమిళనాడు రహస్యసమాచార విభాగం చాలా కాలంగా మద్రాసులోని ఒక వైర్‌లెస్ స్టేషన్‌కి శ్రీలంకలోని వైర్‌లెస్ స్టేషన్‌కి మధ్య చాలాకాలంగా నడుస్తున్న సంభాషణలని తెలుసుకోవాలని ప్రయత్నిస్తూనే వుంది. కానీ ఎన్నడూ సఫలం కాలేదు. ఆ సంభాషణలన్నీ అంకెలు, అక్షరాలు కలిసిన ఒక ప్రత్యేకమైన కోడ్‌లో నడుస్తుండేవి. ఆ సమాచారాన్ని పోగేసి వుంచాయి కానీ డీకోడ్ చేయలేకపోయాయి. రాజీవ్ హత్య తర్వాత సిట్ బృందం రాకతో యీ సంభాషణల డీకోడింగ్ ప్రయత్నంపై దృష్టి సారించారు. ఎంతవరకూ వచ్చారని కార్తికేయన్ రోజూ వాళ్లని సతాయించేవారు. అసలు యీ స్టేషన్‌లు ఎక్కడున్నాయని అడిగారు. మద్రాసు సమీపంలోని వైర్‌లెస్ స్టేషన్ నెంబరు 95. శ్రీలంకలో దాని నెంబరు 91. రాజీవ్ హత్య తర్వాత మద్రాసులో 910 నెంబరు వైర్‌లెస్ స్టేషన్ యాక్టివ్ అయింది. ఇది పాతదాని కంటె చాలా పవర్‌ఫుల్. రెండూ అత్యాధునికమైన పరికరాలు వాడేవారు. పైగా ఆపరేటర్లు ఎంత నిపుణులంటే హఠాత్తుగా ఒక ఫ్రీక్వెన్సీనుండి మరొక ఫ్రీక్వెన్సీకి మారిపోయేవారు. మనవాళ్లు ఒక ఫ్రీక్వెన్సీలోని సమాచారాన్ని పసిగట్టి రాబట్టే లోపున కీలకమైన మిగతా సమాచారాన్ని తీసేసేవారు.

సిట్ పట్టుదల వలన యీ విభాగం మరింత బలగంతో పనిచేసింది. చివరకు 50–60% సమాచారాన్ని సేకరించగలిగారు. అలా లభించినదాన్ని డీకోడ్ చేయడం మరొక సమస్య. పద్మ అరెస్టు తర్వాత లభించిన డీకోడింగ్ షీటు వంటివి వుపయోగించి దొరికినదానిలో 60–70% డీకోడ్ చేయగలిగారు. జూన్ మొదటి వారం నుండి దొరికిన సమాచారం తెలిసిపోవడంతో శివరాజన్ ఎక్కడో దాగున్నాడనీ, ఆందోళన పడుతున్నాడనీ, పారిపోవడానికి చూస్తున్నాడనీ యివన్నీ తెలిసిపోయాయి. అంతేకాదు దీని ద్వారానే కొందరు కుట్రదారుల పేర్లు, మారుపేర్లు కూడా తెలిసాయి – ధాను (మరో పేరు అన్బు), శుభ (మరో పేర్లు నిత్య, తాతియా), రాబర్ట్ పయాస్, రవి (ప్రకాశం), మురుగన్ (ఇందు మాస్టర్), రాధా అయ్య (సభాపతి పిళ్లయ్), నీలన్, రమణన్, ఇందీవరన్ కుట్టి, చొక్కన్, గుండప్ప, నళిని (ఆఫీసరు అమ్మాయి), కిట్టు (ఎల్‌టిటిఇ నాయకుడు), కాశీ ఆనందన్ (ఎల్‌టిటిఇ కేంద్ర కమిటీ సభ్యుడు).

మద్రాసు పరిసరాల్లో వున్న వైర్‌లెస్ స్టేషన్‌ను పసిగట్టడం ప్రథమకర్తవ్యం అయింది. ఇండియన్ యింటెలిజెన్సు ఏజన్సీలతో, వాళ్ల కమ్యూనికేషన్ యింజనీర్లతో కార్తికేయన్ చర్చిస్తూ వుండేవారు. మద్రాసులో వున్న హ్యామ్ రేడియో ఆపరేటర్లు (వైర్‌లెస్ సహాయంతో యితర దేశాలతో సంభాషించే హాబీ కలవారు, రాజీవ్ కూడా వీరిలో ఒకరు) మేమూ సాయం చేస్తామంటూ ముందుకు వచ్చారు.

ఎందరు ప్రయత్నించినా ఆ స్టేషన్ ఎక్కడుందో దొరకలేదు. అప్పుడు హైదరాబాదులోని డిఫెన్స్ ఎలక్ట్రానిక్ రీసెర్చ్ లాబ్ (డిఎల్ఆర్ఎల్) నిపుణుల్ని, మద్రాసులో టెలికమ్యూనికేషన్ శాఖకు చెందిన యింటర్నేషనల్ మానిటరింగ్ సెంటర్ నిపుణుల్ని, కేంద్ర కమ్యూనికేషన్ శాఖకి చెందిన వైర్‌లెస్, ప్లానింగ్ – కో ఆర్డినేషన్ నిపుణుల్ని, ఆర్మీ సిగ్నల్ రెజిమెంట్ నిపుణుల్ని మద్రాసుకి వెంటనే రప్పించి సమావేశపరిచారు. అంతేకాదు హైదరాబాదు నుంచి హైఫ్రీక్వెన్సీ కమ్యూనికేషన్ రిసీవర్లను తెప్పించారు. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2012)**